సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 4 । డిసెంబర్ । 2023



కనుల పండువగా లక్షార్చన

ప్రొద్దుటూరులోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి లక్షార్చన మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. -10లో



బౌలర్ల హవా

కడపలోని కేఎస్ఆర్ఎం మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, సెంట్రల్ జోన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు రాణించారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.110	రూ.220



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 245 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	375	400
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 104.940 కిలోలు

న్యూస్‌రీల్

నేటి స్పందన రద్దు

రాయచోటి: మిచాంగ్ తుపాన్ ప్రభావం నేపథ్యంలో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన మల్లయ్యకొండకు కార్తీకమాసం పురస్కరించుకుని సోమవారం నాలుగు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5.30, 6.30, 7.30లకు బయలుదేరి తంబళ్లపల్లె రాగా మాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ తిరుగుతాయన్నారు. మరొక బస్సు ఉదయం 5 గంటకు నేరుగా మల్లయ్యకొండకు, మదనపల్లెకు తిరుగుతుందని వివరించారు.

అమెరికా స్టాన్ ఫోర్డ్‌కు మిట్స్ విద్యార్థులు



స్టాన్‌ఫోర్డ్‌కు ఎంపికైన విద్యార్థులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు మునితనోజ్ వసంత పల్లె, లోకేష్ అయ్యస్వామి, అమేయ శ్రీకసా, ధరణి వేమూరి అమెరికాలోని ప్రముఖ స్టాన్‌ఫోర్ట్ యూనివర్సిటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. వీరు ఇన్నోవేషన్ ఫెలోషిప్ ప్రోగ్రాంకు ఎంపికైనట్లు తెలిపారు. కరస్పాండెంట్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి వీరిని అభినందించారు

స్విమ్మింగ్ జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 16, 17 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ శిక్షకుడు ధనుంజయరెడ్డి, సీనియర్ జాతీయ క్రీడాకారుడు యోగీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

గ్రూప్–1 బాలబాలికలు: రామకృష్ణ, మాధవ, శోభన, హేమలత

గ్రూప్–2 బాలబాలికలు: నాగవర్ధన్, యశ్వంత్, దినేష్, కార్తిక్, దేవి, మోక్షప్రియ, దీక్షిత.

గ్రూప్–3 బాలబాలికలు: జాన్ అఖిలేష్, మోక్షిత్, నిఖిలేష్, షణ్ముఖ్, త్రిభువన్‌రెడ్డి, శ్రీవెంకటసాయి, కావ్యశ్రీ.

ముంచుకొస్తున్న మిచాంగ్

- అధికార యంత్రాంగం అప్రమత్తం
- రైల్వేకోడూరు వద్ద జాతీయ రహదారిపై స్వల్పంగా పారుతున్న నీరు



కోడూరులో వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఆర్డీఓ



చిన్నమండెం మండలం, శ్రీనివాసపురం రిజర్వాయర్ పరిధిలో వరిపంటను వడుపుతున్న యంత్రం

సాక్షి రాయచోటి/రాయచోటి: ముంచుకొస్తున్న మిచాంగ్ తుపాను ప్రజలను కలవరపెడుతోంది. ఇప్పటికే జిల్లాలో వర్ష ప్రభావం కనిపిస్తోంది. వరి కోతకు వచ్చిన దశలో వానలు పడుతుండడంతో రైతన్నలో ఆందోళన మొదలైంది. ఆదివారం ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండడంతోపాటు కొండ ప్రాంతాల వద్ద దట్టమైన పొగమంచు అలుముకుంది. జిల్లాలోని మదనపల్లె, రైల్వేకోడూరు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కడప–తిరుపతి ప్రధాన రహదారిలోని రైల్వేకోడూరు దాటిన అనంతరం రోడ్డుపైకి శేషాచాలం అడవుల నుంచి వచ్చిన నీరు ప్రవహిస్తోంది. దీంతో కోడూరు పరిసర ప్రాంతాల్లో మామిడి తోటల్లో నీళ్లు నిలిచాయి. అలాగే చిట్వేలి, రాజంపేట, పుల్లంపేట, కలికిరి, పీలేరు, బి.కొత్తకోట తదితర మండలాల్లో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ప్రవహించాయి. నెల్లూరు–మచిలీపట్నం సమీపంలోని వాయుగుండం తీరం దాటుతున్న తరుణంలో సమీప ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాను ప్రభావం నేపథ్యాన్ని వాతావరణశాఖ ముందుగా హెచ్చరించడంతో జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా ఆధ్వర్యంలో జిల్లాలోని అధికారులు అప్రమత్తం అయ్యారు. కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అధిక వర్షం కురిస్తే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని విద్యా సంస్థలకు సోమవారం సెలవుదినంగా కలెక్టర్ ప్రకటించారు.

వెంటాడుతున్న కరువు..

ఈ ఏడాది రైతన్నలకు ఏదీ కలిసి రావడం లేదు. ఇదివరకు సరైన వర్షాలు లేక అరకొరగా పంట సాగు చేశారు రైతులు. తాజాగా అకాల వర్షాలు వారిని కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో అనుకూలమైన వర్షాలు లేక రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. జిల్లాలోని చెరువులు ఒట్టిపోయాయి. బోరుబావులలో నీరు అడుగంటి పోయింది. వర్షాధారంగా సాగైన వేరుశనగ ఇతర పంటలు దెబ్బతినడంతో వాటికి పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

వరిపంటను కాపాడుకోండి....

అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నేలవాలిన వరిని పైకిలేపి కట్టలు కట్టి ఉప్పు ద్రావణం పిచికారి చేసుకున్నట్లైతే గింజలు మొలకెత్తకుండా ఉంటాయని, కొంతమేర పంట కాపాడుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. మొలకెత్తిన, దెబ్బతిన్న వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

▶▶ వరికి 'కోత' పెడుతుందా!

ఎన్నో ఆశలతో పంటలను సాగు చేసే రైతులకు ప్రకృతి, మార్కెట్, చీడపీడల ఎదురు దాడులతో గుక్క తిప్పకుండా విలవిలలాడేలా చేస్తున్నాయి. ఇటీవల ఖరీఫ్ సమయంలో ఆరువేల హెక్టార్లలో సాగైన వరిపంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ఈ పంట కోత దశకు చేరుకోవడంతో రైతులు యంత్రాలు, కూలీల సాయంతో వొడుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ప్రకృతి మిచాంగ్ తుపాన్ రూపంలో వెంటాడుతోంది. వారం రోజులుగా ఆకాశంలో మబ్బులు ఆడుతున్నాయి. జడివానతో వరి రైతులను నిలువునా ముంచేలా ఉంది. వడగళ్లు, కుండపోత వర్షం కురవకపోయినా చిన్నపాటి జల్లులు ఎడతెరిపి లేకుండా పడుతుండటంతో కోత దశలో ఉన్న పంటను ఎలా కాపాడుకోవాలో తెలియని రైతులు దిక్కులు చూస్తున్నారు. ఈ ఏడు ఖరీఫ్‌లో అనుకున్నంత వర్షాలు లేకపోయినా జిల్లాలో రైతులు బోరు బావులు, ప్రాజెక్టులు కింద వరి పంటను ఆరువేల హెక్టార్ల వరకు సాగు చేశారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని రాయచోటి, రాజంపేట, మందనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో కోత దశకు వచ్చిన వరి పంట ఎక్కువగా దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పాఠశాలలు, విద్యాసంస్థలకు సోమవారం సెలవు
- కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లాపై మిచాంగ్ తుపాన్ ప్రభావం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గిరీషా పీఎస్ కోరారు. రైల్వేకోడూరు, రాజంపేట తదితర ప్రాంతాలలో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ సూచన మేరకు అన్నమయ్య జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలకు సోమవారం సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లుగా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలు



డైట్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి

రాయచోటి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు అన్నమయ్య జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం ఉదయం జిల్లా వ్యాప్తంగా రాయచోటిలో మూడు కేంద్రాలు, రాజంపేటలో మూడు కేంద్రాలు, మదనపల్లిలో నాలుగు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఏటా డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్, న్యూ ఢిల్లీ వారు నవంబర్, డిసెంబర్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి ఎం ప్రసాద్ బాబు రాయచోటిలో జరుగుతున్న పరీక్షా కేంద్రాలైన డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఈఓ మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2496 మంది విద్యార్థులను కేటాయించగా పరీక్షకు 2413 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

గండికోట సందర్శన

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలంలోని పర్యాటక ప్రాంతమైన గండికోటను ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మహిళా అధికారులు సందర్శించారు. ఆదివారం వీరు ఇక్కడి పెన్నానది, మాధవరాయ ఆలయం, జుమ్మా మసీద్, పెన్నాలోయ, కోనేరును చూసి పరవశించిపోయారు. అనంతరం వారు మాట్లాడుతూ గండికోటలో కోట అందాలు ఆకట్టుకున్నాయన్నారు. యూనియన్ అధ్యక్షురాలు వైదూరి దేవి, ఉపాధ్యక్షురాలు లక్ష్మణ కుమారి, సెక్రటరి సుస్మిత, రాజేశ్వరి, శారద పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠా మహోత్సవం



భక్తులకు ఆశీర్వాదం ఇస్తున్న విచారణ గురువులు

కలసపాడు: కలసపాడు సగిలేరు ఒడ్డున వెలసిన పురాతన పరిశుద్ధ పరిపేతురు పరిపాలు ఆలయ 136వ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాయలసీమ డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజాక్‌వరప్రసాద్ భక్తులకు దైవసందేశం ఇచ్చారు. డీసరీ చైర్మన్ వరప్రసాద్, సంజయ్‌మధు, ఆశిస్‌గాబ్రియేల్, బేబీ సరోజ, రవిక్రీస్తుదారి, శ్రీనివాస్‌పాల్‌ల ఆధ్వర్యంలో సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు కె.జె.ప్రవీణ్ (చిన్ను) చర్చి క్లుప్త చరిత్రను బిషప్ పి.ఐజాక్‌వరప్రసాద్ ఆవిష్కరించి 1000 ప్రతులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. గుడిమె సుదర్శన్ వారి చెక్కభజన, గుమ్మడి జీవన్‌కుమార్ విజయవాడ వారి నిర్వహించిన దావీదు విజయం క్రైస్తవ నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ నాగమురళి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



దైవసందేశం ఇస్తున్న డాక్టర్ ఐజాక్‌వరప్రసాద్

సంకల్పం ముందు వైకల్యం చిన్నబోతుంది

మైదుకూరు: సంకల్పం బలంగా ఉంటే వైకల్యం కూడా చిన్నబోతుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మైదుకూరులో ఆదివారం కేంద్ర న్యాయ సహాయ సాధికార శాఖ ఆధ్వర్యంలో, దివ్యాంగుల సాధికార సంస్థ దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలు, హియరింగ్, ఎయిడ్స్ వంటి ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ శారీరకంగా బాగా ఉన్న వారు కూడా దివ్యాంగుల ప్రతిభకు సరితూగరని అన్నారు. ఇందుకు మైదుకూరు నియోజకవర్గానికి చెందిన వినోద్ అనే యువకుడు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు వైకల్యంతో వీల్ చైర్‌కు పరిమితమైన ఆ యువకుడు పట్టుదలతో ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండటం అందరికి ఆదర్శనీయమని తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో ఉపకరణాల లబ్దిదారుల కోసం నిర్వహించిన 42 శిబిరాల్లో 20వేల మందిని పరీక్షించారని తెలిపారు. ఇందులో 9,500 మందిని గుర్తించి ఉపకరణాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. దక్షిణ భారత దేశంలోనే ఎక్కడా ఇటువంటి కార్యక్రమం జరగలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అన్ని వేళల్లో జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ అవినాష్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

- కడప సర్కిల్‌లో రూ.1659 కోట్ల బకాయిలు
- ప్రైవేటు బకాయిలు రూ.898.89కోట్ల పైమాటే



విద్యుత్ భవన్

కడప కార్పొరేషన్: విద్యుత్ శాఖకు బకాయిలు షాకిస్తున్నాయి. కడప సర్కిల్ అంటే ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బకాయిలు కలిపి రూ1659 కోట్లు ఉండటం ఆ శాఖ అధికారులను కలవరపెడుతోంది. ఇందులో ప్రైవేటు బకాయిలు 595.89కోట్లు, ప్రభుత్వ బకాయిలు రూ.1063కోట్లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా పారిశ్రామిక బకాయిలు రూ.525 కోట్లు, అత్యల్పంగా లోకల్ బాడీస్ బకాయిలు రూ.23 లక్షలు ఉన్నాయి. ఈ బకాయిలను వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

- జిల్లాలో 1050720 గృహ సంబంధమైన కనెక్షన్లు ఉండగా, 416 హెచ్‌టీ కనెక్షన్లు, 134403 డీటీఆర్ సర్వీసులు, 1148 11కేవీ ఫీడర్లు, 302 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

ప్రైవేటు బకాయిలు (కోట్లలో)

కేటగిరి	ఎల్‌టీ	హెచ్‌టీ	మొత్తం
డొమెస్టిక్	40.53	-	40.53
కమర్షియల్	4.21	12.10	16.22
ఇండస్ట్రియల్	2.67	525.56	527.67
లోకల్ బాడీస్	0.23	-	0.23
అగ్రికల్చర్	11.23	-	11.23

బకాయిల వసూలుకు చర్యలు



కడప సర్కిల్‌లో విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా ప్రైవేటు బకాయిలపై దృష్టి పెట్టాం. వినియోగదారులు బకాయిలు చెల్లించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలి.
–రమణ, ఏపీఎస్‌పీడీసీఎల్. పర్యవేక్షక ఇంజినీరు

అన్నమయ్య జిల్లా... ఉర్దూ కవుల ఖిల్లా

- ఉర్దూ బాషాభివృద్ధికి కృషి
- జాతీయ స్థాయిలో గుర్తింపు
- నేడు మదనపల్లెలో అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం



మదనపల్లె సిటీ: కవులు, సాహితీపరుల జిల్లాగా ఖ్యాతి గాంచిన అన్నమయ్య జిల్లాలో తెలుగుతో పాటు ఉర్దూ సాహిత్యమూ పరిమళిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి దాటి ప్రపంచ స్థాయిలో సాహితీ వెలుగులు పంచుతోంది. కవి సమ్మేళనాలు, సాహితీ సదస్సులు, కవితలు, పాటలు, వ్యాసాలు, నాటకాలు ఇలా పలు అంశాలలో జిల్లాకు చెందిన రచయితలు, కవులు, సాహితీవేత్తలు తమ సాహిత్యప్రతిభను చాటుతున్నారు. మదనపల్లెలో ఈ నెల 4న సోమవారం జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహిస్తున్న సందర్భంగా జాతీయ స్థాయిలో ఉర్దూ సాహిత్యానికి ఆయువుపట్టుగా నిలుస్తున్న జిల్లాలోని పలువురు కవులు, సాహితీవేత్తల గురిం కథనం.

▶▶ ఖమర్ అమీనీ



మదనపల్లె పట్టణం దేవళం వీధికి చెందిన బాబా ఫక్రుద్దీన్ అలియాస్ ఖమర్ అమీనీ ఉర్దూ కవి సమ్మేళనాల నిర్వహణలో దిట్ట. ఈయనకు ఉర్దూ కవిత్వంలో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఈయన రచించిన తవాఫ్–ఏ–గజల్, నాత్‌కీ అంజుమన్, కష్కోల్–ఏ–ఖల్బ్–ఓ–నజర్, కష్కోల్–ఏ–కరమ్, ఇర్తికాజ్–ఏ–అఫ్కార్ కవితా సంపుటాలు జాతీయస్థాయిలో మన్ననలు పొందాయి. ఖమర్ అమీనీ అనేక పురస్కారాలు అందుకున్నారు. ఆయన సాహిత్యంపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు.

▶▶ డాక్టర్ నిసార్ అహ్మద్




శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో ఉర్దూ ఆచార్యులుగా పని చేస్తున్న డాక్టర్ నిసార్ అహ్మద్ ఉర్దూ సాహితీవేత్త, కవిగా పేరు తెచ్చుకున్నారు. ఉర్దూ బాష, సాహిత్యం, ఉర్దూ సంస్కతి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. పలు కవితలు, నాత్, గజల్స్ రాశారు. పాఠశాల దశ నుంచే ఉర్దూపై మక్కువ పెంచుకున్న ఈయన నిరంతరం ఉర్దూ సాహిత్య సేవకు కషి చేస్తున్నారు. భారతదేశంలో ఉర్దూ బాలల సాహిత్యం అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీకు మొదటి డైరెక్టర్‌గా కూడా సేవలను అందించారు.

▶▶ పఠాన్ మహమ్మద్‌ఖాన్



పఠాన్ మహమ్మద్‌ఖాన్, కలం పేరు జోహర్. మదనపల్లె పట్టణానికి చెందిన ఈయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఉర్దూ సాహిత్యంలో పలు గజల్స్, హమ్ద్, నాత్లు రాశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ ద్వారా ఈయనకు ఇటీవల లైఫ్‌టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది.

▶▶ డాక్టర్ నఖీవుల్లాఖాన్



గుర్రంకొండకు చెందిన డాక్టర్ నఖీవుల్లాఖాన్ ఉర్దూ కవిగా పేరు తెచ్చుకున్నారు. నఖీ ఆయన కలం పేరు. పలు కథలు, గజల్స్, నాత్, హమ్ద్‌లు రాశారు. ఉర్దూ సాహిత్యంలో ఈయన చేసిన సేవలు, పరిశోధనలకుగాను ఎస్వీయూ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు.

▶▶ తఖీవుల్లాఖాన్



గుర్రంకొండకు చెందిన తఖీవుల్లాఖాన్ తఖీ కలం పేరుతో అనేక గజల్స్, నాత్, కవితలు రాశారు. జాతీయ స్థాయిలో అనేక ఉర్దూ కవి సమ్మేళనాల్లో పాల్గొని కవితా గానం చేసి గుర్తింపు పొందారు.

▶▶ డాక్టర్ మాహీర్ జమాలీ



గుర్రంకొండకు చెందిన డాక్టర్ మాహీర్ జమాలీ వృత్తి రీత్యా వైద్యుడు. మాహీర్ కలం పేరుతో అనేక ఉర్దూ హమ్ద్, నాత్, గజల్స్ రాశారు. జాతీయ స్థాయిలో అనేక కవి సమ్మేళనాలు, సదస్సులలో పాల్గొని ప్రతిభను చాటుతున్నారు. గుర్రంకొండలో ఉర్దూ కవి సమ్మేళనాలు, సెమినార్లు నిర్వహించి ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

▶▶ షీన్‌మీమ్ హాషిం



రాయచోటికి చెందిన షీన్‌మీమ్ హాషిం వృత్తిరీత్యా ఉర్దూ ఉపాధ్యాయుడు. తలీఖ్ కలం పేరుతో అనేక ఉర్దూ హమ్ద్, నాత్, గజల్స్ రాశారు. రాష్ట్ర స్థాయిలో అనేక పురస్కారాలను అందుకున్నారు. ప్రస్తుతం రాజంపేటలో పని చేస్తున్నారు.

▶▶ ఇమామ్ ఖాసీం...



ఇమామ్ ఖాసీం కలం పేరు సాఖి. లక్కిరెడ్డిపల్లెలో ఇంగ్లీషు టీచర్‌గా పని చేస్తున్నారు. ఆయన వందలాది హమ్ద్, నాత్, గజల్స్ రాశారు. ఆయన రాసిన అబ్షార్–ఏ–సఖున్, ఫిక్ర్–ఓ–ఫన్–కే ఫూల్ ఉర్దూదోహే కవితా సంపుటాలు దేశ వ్యాప్తంగా మన్ననలు పొందాయి.

క్లుప్తంగా

ఎద్దు దాడిలో వ్యక్తికి గాయాలు

నిమ్మనపల్లె : ఎద్దు దాడి చేయడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు కదిరప్ప(45) తన ఎద్దులను మేత కోసం పొలం వద్దకు తోలుకెళ్లాడు. అక్కడ ఎద్దులను అదిలించే ప్రయత్నం చేయగా, ఒక్కసారిగా ఎద్దు కదిరప్పపై దాడిచేసింది. దీంతో అతను గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కొడుకు మృతిచెందాడన్న మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. వెలిగల్లు పంచాయతీ పడమటవారిపల్లెకు చెందిన కృష్ణప్ప భార్య ఎస్.యశోదమ్మ(50) కుమారుడు రామ్మోహన్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏడాది క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి తీవ్ర ఆవేదనలో ఉన్న యశోదమ్మ ఆదివారం మనస్తాపంతో ఇంటివద్దే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది. పెద్దమండ్యం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రామాపురం : కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిపై చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలో ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కిషోర్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేసి వీటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మదనపల్లె : భిక్షాటనతో జీవనం సాగిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మరణించిన సంఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో భిక్షాటన చేసుకుని జీవించే ఓ వ్యక్తి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా, చూసిన వారు నీళ్లు అందించారు. కొద్దిసేపటికి అతడు ప్రాణం విడిచాడు. విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో టూటౌన్ ఎస్‌ఐ ఇనాయతుల్లా, ఏఎస్‌ఐ వెంకటరమణ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 65 సంవత్సరాలు ఉంటుందని, కుడిచేతిపై శ్రీరామ, సీతమ్మ అనే పచ్చబొట్టుతో ఉన్న అక్షరాలను గుర్తించారు. మృతుడి ఆచూకీపై స్థానికులను విచారించగా, వారు తమకు తెలియదని చెప్పడంతో మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే, టూటౌన్ పోలీసులను సంప్రదిస్తే.. శవాన్ని అప్పగిస్తామన్నారు. వివరాలకు మదనపల్లె టూటౌన్ ఎస్‌ఐ 9440736741 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ముంబై–చెన్నై కారిడార్‌లో..

లెవెల్ క్రాసింగ్ గేట్లకు మంగళం!

- రైళ్ల వేగం పెంపు నేపథ్యంలో...
- చకచకా ఆర్‌యూబీల నిర్మాణాలు
- తెల్లదొరల కాలంనాటి గేట్ విధానానికి చెల్లుచీటీ
- రూ.72 కోట్లతో కోడూరు రైల్వే పరిధిలో 9 ఆర్‌యూబీలు
- ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషి



నందలూరు రైల్వేకేంద్రంలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు



ఎల్‌సీ గేట్

రాజంపేట : భారతీయ రైల్వేచరిత్రలో బ్రిటీషుకాలం నుంచి ఉన్న విధానాలు ఒక్కొక్కటీ కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఇందులో ఒకటి రైల్వేగేట్ విధానం. రైలుమార్గంలో అనేక గ్రామాలకు రైల్వేగేట్ ప్రధానం. ఇప్పుడు ఒవైపు రైల్వే వేగం.. మరోవైపు సిబ్బంది భారం తగ్గించుకోవడమే లక్ష్యంగా రైల్వేశాఖ రైల్వేగేట్లకు మంగళం పాడుతోంది. ముంబై–చెన్నై కారిడార్ రైలు మార్గంలోని గుత్తి–రేణిగుంట మధ్య రైల్వేగేట్స్(లెవెల్‌క్రాసింగ్ గేట్స్)ను ఎత్తివేస్తూ వస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సబ్‌వేలు నిర్మిస్తున్నారు.

రైళ్ల వేగం పెంపు నేపథ్యంలో..

రైళ్ల వేగం పెంపు నేపథ్యంలో ఎక్కడా కూడా రైళ్ల రాకపోకలకు అవాంతరాలు లేకుండా చేసే పనిలో భాగంగా లెవెల్ క్రాసింగ్ గేట్లను తొలగించుకుంటూ వస్తున్నారు. ఇందులో రెండు రకాల గేట్లు ఉన్నాయి. ఒకటి మనిషి కాపలా ఉన్న గేట్లు, మరొకటి మనిషి కాపలాలేని గేట్లు ఉన్నాయి. మనిషి కాపలా లేని గేటు వల్ల అనేక ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇవి ఇలాగే కొనసాగితే వందేభారత్ లాంటి రైళ్లతోపాటు సాధారణంగా నడుస్తున్న రైళ్లు 110 కిలోమీటర్లకు పైగా వేగంతో నడుస్తున్న క్రమంలో గేట్ల వల్ల ఇబ్బందికరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయని రైల్వేశాఖ భావించింది.

చకచకా ఆర్‌యూబీల నిర్మాణాలు..

ముంబై–చెన్నై రైలుమార్గంలో భవిష్యత్తులో ఎల్‌సీ గేట్లు లేకుండా చేసేందుకు రైల్వేశాఖ ప్రత్యామ్నాయంగా ప్రజల రాకపోకలకు సంబంధించి ఆర్‌యూబీ, ఆర్వోబీలను నిర్మిస్తోంది. ఇందుకు రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనులు వేగవంతంగా చేపడుతున్నారు. గ్రామాల మధ్య రైల్వే ట్రాక్స్ ఉండటం వలన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రైల్వేశాఖ చర్యలు తీసుకుంటోంది.

ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

రైలు పట్టాలకు ఇరువైపులా ఉన్న పల్లె మార్గాల్లో ఆర్‌యూబీల నిర్మాణానికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విశేష కృషి చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే తొమ్మిది ఆర్‌యూబీల నిర్మాణాల మంజూరుకు కృషి చేశారు. రైల్వేమంత్రిని కలిసి ఎల్‌సీ గేట్లు ఎత్తివేస్తే ఇబ్బందులు పడే వారి సమస్యను విన్నవించారు. వందలాది గ్రామాల ప్రజలు గేట్లు ఎత్తి వేసే క్రమంలో ఇబ్బందులు పడకుండా ఆర్‌యూబీల నిర్మాణాలపై దృష్టి సారించారు. ఇందులో కోడూరు, బొజ్జవారిపల్లె, అనంతరాజుపేట, ఓబులవారిపల్లె, టి.కమ్మపల్లె, రెడ్డిపల్లె క్రాస్, అప్పరాజుపేటలో ఆర్‌యూబీ(సబ్‌వే)లను మంజూరు చేయించారు. వీటి నిర్మాణం కోసం రూ.72కోట్లు వ్యయం చేస్తున్నారు. కోడూరు పట్టణంలో వందేళ్ల నుంచి ఉన్న సమస్యకు ఆర్‌యూబీ నిర్మాణంతో మార్గం సుగమం చేశారు.

ఎల్‌సీ గేట్లు..ఆర్‌యూబీలు..

2023–2024 ఏడాదిలో 41 లెవల్ క్రాసింగ్ గేట్లు ఉన్నాయి. ఒక గేటు మూసివేశారు. 23 ఆర్‌యూబీ(రోడ్ అండర్ బ్రిడ్జి) నిర్మాణంలో ఉన్నాయి. 16 ఆర్‌ఓబీలు(రోడ్ ఓవర్ బ్రిడ్జి)లు మంజూరయ్యాయి. డైవర్షన్ పేరుతో ఒక గేటు మూసివేశారు.

కోడూరు పరిధిలో తొమ్మిది ఆర్‌యూబీలు

కోడూరు పరిధిలో తొమ్మిది ఆర్‌యూబీలు మంజూరయ్యాయి. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారు. కోడూరు పట్టణంలో వందేళ్ల రైల్వేసమస్యకు ఆర్‌యూబీ నిర్మాణంతో పరిష్కారం చూపారు. అలాగే రైలు పట్టాలకు ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఆర్‌యూబీల మంజూరుకు కృషిచేశారు.

-తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సభ్యుడు, డీఆర్‌యూసీసీ, ఓబులవారిపల్లె

మిథున్‌రెడ్డి కృషితో రెండు ఆర్‌యూబీలు మంజూరు

పది గ్రామాలకు మేలు చేసేలా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రెండు ఆర్‌యూబీలను మంజూరు చేయించారు. దశాబ్దాల కాలం మనిషి కాపలాలేని గేటు ఉండేది. అప్పట్లో అనేక మంది రైలు ఢీకొని మృత్యువాతపడ్డారు. అనంతరం మనిషి కాపలా ఉండే గేటును పెట్టారు. ఇప్పుడు ఈ గేటు స్థానంలో ఆర్‌యూబీ నిర్మించడం అభినందనీయం. అప్పరాజుపేటవాసులు ఎంపీకి రుణపడి ఉంటారు.

-సయ్యద్ ముస్తాక్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్, పుల్లంపేట

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

విద్యా వ్యవస్థకు పెద్ద పీట



జగనన్న ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేసింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు చాలా అభివృద్ధి చెందాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలో భాగంగా నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బ్యాగు, బూట్లు, టై, బెల్టు, డిక్షనరీ, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు ప్రవేశపెట్టారు. దీంతో ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. అమ్మఒడి పథకం ద్వారా పేద , బడుగు, బలహీన వర్గాల వారికి మంచి జరిగింది. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం మరింత శుభ పరిణామం.

-యామవరం రామకేశవ, ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, వెంకటేశ్వరపురం, సిద్దవటం మండలం

నెరవేరిన సొంతింటి కల



గతంలో మాకు సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. అద్దె కట్టేందుకు నానా ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరైంది. సొంతింటి నిర్మాణ పనులు చేసుకుంటున్నాము.

-ఎస్.ఫరీదా, ములకలచెరువు

సులభంగా సర్టిఫికెట్ అందించారు



గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే అర్జీ పెట్టుకునేందుకు నానా కష్టాలు పడేవాళ్లం. సర్టిఫికెట్ చేతికందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం ఒక్కరోజులోనే అందించారు. ఇలాంటి సేవలందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- వి. రమణమ్మ, బండ్లవంక, పీలేరు

బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి



మంజుభార్గవిని సత్కరిస్తున్న బ్రాహ్మణ ప్రముఖులు

కడప కల్చరల్ : బ్రాహ్మణుల పట్ల సమాజంలోని అన్నివర్గాల వారికి ఎంతో గౌరవముందని, వాటిని నిలుపుకుంటూ వారు అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఉందని సీనియర్ సినీనటి మంజుభార్గవి అన్నారు. ఆదివారం సమైక్య బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణులు స్థానిక సాయి శ్రీనివాస గార్డెన్స్‌లో కార్తీక వన భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంజుభార్గవి మాట్లాడుతూ తాను నటించిన ఎన్నో సినిమాలను ఆదరించి ప్రోత్సహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో బ్రాహ్మణులు సంప్రదాయ ఉపాధికి పరిమితం కాకుండా సమాజంలో ఉన్నత స్థాయి గుర్తింపు, గౌరవాలు సాధించే స్థాయికి ఎదగాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఉదయం శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్థానిక కళా సంఘాల చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. సంస్థ ప్రతినిధులు శివరావు, డాక్టర్ గోపీనాథ్, ఎం.రమణయ్య, చంద్రమౌళి, బాలకృష్ణ, నగరానికి చెందిన పలువురు అర్చకులు, పురోహితులు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన బ్రాహ్మణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చదరంగం పోటీలకు విశేష స్పందన



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగంహాల్‌లో ఆదివారం నిర్వహించిన 1వ వైఎస్ఆర్‌డీసీఏ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ఎంపికలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 38 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. అనంతరం టోర్నమెంట్ విజేతగా పోరుమామిళ్లకు చెందిన దేవేంద్రనాథ్‌రెడ్డి 5 పాయింట్లతో ప్రథమస్థానంలో నిలిచాడు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్, కోచ్ తవసు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

(వరుసగా 1 నుంచి 10వస్థానాలు)..

దేవేంద్రనాథ్‌రెడ్డి, వంశీకృష్ణ, ఉమాదేవి, ఇనోక్, తేజేష్, లిఖిత్, చిన్మయ్, లలిత, అక్షయ్, తేజోమయి.

కనుల పండువగా అయ్యప్పస్వామి లక్షార్చన

35వేల మందికి పైగా భక్తులకు అన్నదానం



పూజాకార్యక్రమంలో అయ్యప్పస్వామి, దేవతా మూర్తులు



లక్షార్చన చేస్తున్న అయ్యప్పస్వామి దీక్షధారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానది తీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి లక్షార్చన మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి, సుబ్రమణ్య, అయ్యప్ప, వెంకటేశ్వర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, అయ్యప్పస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను సుందరమైన సెట్టింగ్‌లలో కొలువుదీర్చారు. 1500 మందికి పైగా అయ్యప్పస్వామి దీక్షధారులు లక్షార్చన మహోత్సవంలో పాల్గొని పసుపు, కుంకుమ, పూలు, భస్మం, పూజా ద్రవ్యాలతో లక్షసార్లు స్వామివారిని మనసారా అర్చించి శరణు వేడారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేంద్రశర్మ కలశాన్ని తలమీద ఉంచుకుని శరణుఘోషల మధ్య పదునెట్టాంబడిని ఎక్కి స్వామికి విభూధితో అభిషేకం చేశారు. అలాగే అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించారు. లక్షార్చన సందర్భంగా దాదాపు 35వేల మందికి పైగా భక్తులకు స్వామి అయ్యప్ప సేవా సంఘం వారు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా స్వామి అయ్యప్ప సేవాసంఘం ప్రతినిధులు, దీక్షదారులు, పోలీసులు, ఆర్పీపీఈ విద్యార్థులు, వలంటీర్లు సేవలందించారు. అలాగే మరకతలింగానికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు, నవరత్నలింగానికి. జలలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పెన్నా ఏటి తీరం కిటకిటలాడింది. స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు నామా రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు వి.ఎస్. మనోహర్, కార్యదర్శి వీపీ పద్మనాభయ్య, కోశాధికారి టి.వినోద్‌కుమార్, నామా వాసు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అండర్–23 మల్టీడేస్ టోర్నీలో బౌలర్ల హవా

మూడోరోజు మ్యాచ్ ప్రారంభం



కేఎస్ఆర్‌ఎం మైదానంలో తలపడుతున్న సెంట్రల్‌జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జోనల్ అండర్–23 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌ల్లో భాగంగా మూడోరోజు మ్యాచ్‌లు ఆదివారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని కేఎస్ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, సెంట్రల్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ జట్టు 39.2 ఓవర్లలో 139 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి. సూర్యవంశీ 32 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు ఎన్. మాధవ్ 5 వికెట్లు, జానీబాషా 4 వికెట్లతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 16 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని మనోజ్‌రాజు 35 పరుగులతో క్రీజులో ఉన్నారు. సెంట్రల్‌జోన్ బౌలర్ రుకేష్ బాబు 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నార్త్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నార్త్‌జోన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 50.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. జట్టులోని సోహన్‌వర్మ 56 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్ వాసు 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



5 వికెట్లు తీసిన రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్ మాధవ్



4 వికెట్లు తీసిన రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్ జానీబాషా

బీసీ కులాలకు సీట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీ బీసీ చైతన్య సేవా సమితి అధ్యక్షుడు బి.సి.రమణ

రాయచోటి అర్బన్ : నేటివరకు చట్టసభల్లో అడుగుపెట్టని బీసీ కులాలకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సీట్లు కేటాయించాలని ఏపీ బీసీ చైతన్య సేవాసమితి అధ్యక్షుడు బి.సి. రమణ డిమాండ్ చేశారు. స్థానిక సాయి శుభ కల్యాణ మండపంలో జీవానందం అధ్యక్షతన జరిగిన రాజంపేట పార్లమెంట్ స్థాయి బీసీ శక్తి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కుమ్మరి, సాలె, రజక, మంగళి, వడ్డెర తదితర బీసీ కులాల వారికి నేటికీ చట్టసభలలో ప్రాతినిధ్యం లేకపోవడం దారుణమన్నారు. ఎస్‌ఆర్‌ఐ టి.వెంకటసుబ్బయ్య, పాల ఏకరి సాధికార సమితి అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ బీసీ కులాల అభ్యర్థులు చట్టసభలకు పోటీచేస్తే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.శివప్రసాద్, టీడీపీ వడ్డెర సాధికార సమితి రాష్ట్రకార్యవర్గ సభ్యుడు నాగార్జున, రజక సంఘం నేతలు రమేష్‌బాబు, శ్రీనివాసులు, బీసీ చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.భద్ర, మదనపల్లె నాయకులు చిరంజీవి, గోపాల్, వడ్డెర సంఘం నాయకుడు మల్లెల రెడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

కలకడలో పేలిన ఐపీ బాంబ్

కలకడ : మండల కేంద్రమైన కలకడలో ఓ వ్యక్తి ఐపీ పెట్టడంతో రైతులు, కూలీలు లబోదిబో మంటున్నారు. కలకడ టౌన్‌కు చెందిన షేక్ అహమ్మద్ బషీర్ కుమారుడు సాదిక్‌బాషా ఐపీ పెట్టినట్లు బాధితులు తెలిపారు. పీలేరులోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కలకడటౌన్, వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 31మందికి రూ. కోటి 15 లక్షల 80 వేలు అప్పు ఉన్నానని తెలిపాడు. తన వద్ద కేవలం రూ.2వేలు విలువచేసే రెండు చొక్కాలు, రెండు ప్యాంట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని చూపాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఒంటిమిట్ట: మండల పరిధిలోని గుంటుగారిపల్లి–కోనరాజుపల్లి మధ్యలో ఉన్న పేకాట స్థావరంపై ఆదివారం ఒంటిమిట్ట పోలీసులు దాడి చేసి 11 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు...తమకు వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు దాడి నిర్వహించి 11 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 1,12,300 నగదును, ఒక కారు, ఒక తుఫాన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

344 బస్తాల రేషన్‌బియ్యం స్వాధీనం

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాని రహదారిలోని ఊటుకూరు సర్కిల్‌లో గల మాధవి కన్వెన్షన్ హాల్ వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 344 బస్తాల రేషన్ బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకున్నట్లు సీకే దిన్నె ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు నుంచి కడప మీదుగా కర్ణాటకలోని బంగారు పేటకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందిందన్నారు. ఏపీ 04 టి డబ్ల్యూ 2169 నెంబర్ గల లారీని ఆపి తనిఖీ చేయగా ప్రొద్దుటూరు టౌన్‌కు చెందిన శరత్ కుమార్ 16,500 కేజీల రేషన్ బియ్యంతోపాటు 60 బస్తాల రాగులను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీటి విలువ దాదాపు 18 లక్షల రూపాయలుగా ఉంటుందన్నారు. లారీ డ్రైవర్ మామిళ్ల వెంకటసుబ్బారెడ్డితో పాటు శరత్ కుమార్‌పై కేసు నమోదు చేశామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఇదురుబాషా పాల్గొన్నారు.